క్లుప్తంగా

సాయిబాబా మందిరంలో బోనాల పండుగ

చీరాల అర్బన్: పట్టణంలోని పాపరాజుతోటలో షిర్డి సాయిబాబా మందిరంలో గురువారం బోనాల పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయిబాబాకు పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

అట్రాసిటీ కేసులో వ్యక్తి అరెస్టు

చీరాల: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితుడిని గురువారం ఒన్‌టౌన్ సీఐ మల్లికార్జున రావు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఆగస్టు 24న చీరాల చర్చి కాంపౌండుకు చెందిన బెజ్జం క్రాంతికుమార్ అనే యువకుడుపై పట్టణంలోని వైకుంఠపురం స్వర్ణగేటు రోడ్డులో నివాసముంటున్న పూనాడ మణికంఠరెడ్డి అనే వ్యక్తి స్వర్ణగేటు వద్ద సెల్‌ఫోన్‌లో వీడియో కాల్ మాట్లాడుతున్న క్రాంతికుమార్‌పై తనను ఎందుకు వీడియో తీస్తున్నావంటూ గొడవపడి అకారణంగా కులంపేరుతో దూషించి విచక్షణారహితంగా దాడి చేసినట్లు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ ఎస్.ప్రసాదరావు ఆదేశాల మేరకు ఎస్సై అరుణజ్యోతి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కేసులో ప్రధాన నిందితుడు మణికంఠను అరెస్టు చేశామన్నారు. నిందితుడిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసుతో పాటు పలు సెక్షన్ల కింద అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు. ఈ కేసులో మరో మైనర్‌పై కూడా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. యువత గంజాయి వంటి మాదకద్రవ్యాల మత్తులో యువత గొడవలు దిగుతూ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. మత్తు పదార్థాల నివారకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు.

నేడు రాజుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

మార్టూరు: మండలంలోని రాజుపాలెం గ్రామంలో నేటి ఉదయం 9 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పర్చూరు కార్యాలయం ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

కొణిదెనలో ప్రతిష్టకు అంకురార్పణ

బల్లికురవ: మండలంలోని కొనిదెన గ్రామంలో ఎంతో చరిత్ర గలిగిన బ్రహ్మకుండం వద్ద గురువారం పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు యాగశాల ప్రవేశంతో అంకురార్పణ చేశారు. ప్రతిష్టాచార్యులు ఐనవోలు సీతాచార్యులు బృందంచే త్రయాంబిక ప్రతిష్ట వేడుకలు భాగంగా యాగశాలలో ప్రత్యేక పూజలు చేట్టారు. శుక్రవారం గ్రామోత్సం, శనివారం ఉదయం 10.45 గంటలకు ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈవేడుకల్లో గ్రామంతో పాటు పరిసర గ్రామాలోని భక్తులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే డిపో అభివృద్ధి



నగదు బహుమతిని అందిస్తున్న కుమారి

చీరాల అర్బన్: ఉద్యోగుల సమష్టి కృషితోనే డిపో అభివృద్ధి సాధ్యమని ఎస్టీఐ డి.కుమారి అన్నారు. గురువారం చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లో అధిక ఆదాయం తెచ్చిన కండక్టర్ డేనియల్‌కు నగదు బహుమతిని అందించారు. జూలైలో అత్యధికంగా ఆదాయం తీసుకువచ్చినందుకు గాను నగదు బహుమతిని అందించామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా,చెల్లెళ్ల అనుబంధం.. రాఖీ



చీరాలలో సుభాషిణికి నూతన వస్త్రాలు బహుకరిస్తున్న వాకర్స్ సభ్యులు



ఇంకొల్లు పోలీసు స్టేషన్‌లో పోలీసులకు రాఖీ కడుతున్న విద్యార్థులు



బల్లికురవలో చెల్లిని ఆశీర్వదిస్తున్న అన్నలు

- వాడవాడలా రాఖీ పౌర్ణమి వేడుకలు
- ఆడపడుచులతో రాకతో ఇళ్లల్లో సందడి

బల్లికురవ: అన్నా,చెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు కులమతాలకు అతీతంగా గురువారం రాఖీ పండగ వేడుకలు మండలంలోని వాడవాడల ఘనంగా నిర్వహంచారు. అక్క తమ్ముడి ఇంటికి చేరటం అన్న చెల్లెలు ఇంటికి వెళ్లటంతో గ్రామాల వారీగా ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. చెల్లి తన అన్నయ్యకు, అక్క తన తమ్ముడికి ఎప్పడు ప్రేమానురాగాలతో ఉండాలని ఉన్నత స్థాయికి ఉదగాలని కోరుకుంటూ రాఖీ కట్టారు. అనంతరం తమ తోబుట్టువుకు విలువైన బహుమతులు అందించారు.

పోలీసు అధికారులతో రక్షాబంధన్ ..

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల బాలికలు రక్షా బంధన్ కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించారు. బాలికలు, మహిళలకు రక్షణ కల్పిస్తున్న పోలీసు అధికారులకు రాఖీ కట్టి కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకోసం బాలికలు నేరుగా ఇంకొల్లు పోలీసు స్టేషన్ కార్యాలయానికి వచ్చి సీఐ వీ సూర్యనారాయణ, ఎస్ఐ ఎస్‌కే నాయబ్ రసూల్‌లకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసి రాఖీలు కట్టి వారి ఆనందాలను పోలీసు అధికారులు, సిబ్బందితో పంచుకున్నారు. ఇందులో భాగంగా సీఐ, ఎస్ఐలు దిశ చట్టం గురించి పిల్లలకు అవగాహన కల్పించారు.

అనాథాశ్రమాలకు బియ్యం అందజేత

చీరాల రూరల్: చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలను గురువారం ఎన్ఆర్అండ్‌పిఎం హైస్కూల్ క్రీడా మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాకింగ్ సభ్యురాలు, ఇన్నర్‌వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు ఇస్తర్ల సుభాషిణి 70 మంది వాకరులకు రాఖీలు కట్టి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం వాకర్లు ఆమెకు నూతన వస్త్రాలు (చీర, జాకెట్) పసుపు, కుంకుమ అందించి నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. తదనంతరం సేవా కార్యక్రమాలలో భాగంగా హరిప్రసాద్ నగర్‌లోని కోటయ్య అనాథశ్రమానికి, నవాబ్ పేటలోని పాండురంగ అనాథ వృద్ధాశ్రమానికి కేజీ బియ్యం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణ, ట్రెజరర్ వీ మురళీకృష్ణ, సభ్యులు ఇస్తర్ల సుభాషిణి, శీరాం రమేష్, చింతా రమేష్, చారుగుళ్ల ప్రసాద్, డేగల తిరుపతిరావు, చలపతి, ఉమా మహేశ్వరరావు, నారాయణమూర్తి, దరియా సాహెబ్, ఆశ్రమాల నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విఖనస మహర్షి జయంతి



విఖనసాచార్యుని నగరోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

చీరాల అర్బన్: శ్రావణ పౌర్ణమి, విఖనస మహర్షి జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక సంతబజారులోని వేణుగోపాలస్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, విశేష అలంకరణలు చేశారు. ఈ సందర్భంగా చీరాల డివిజన్ వైఖానస సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సభకు రావుల కొల్లు పరాంకుశం వెంకట రంగాచార్యులు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తిరుపతి వెంకటేశ్వర వేదిక్ యూనివర్శిటి అసిస్టెంట్ ప్రొఫెసర్ రొంపిచర్ల వెంకట సత్యనారాయణాచార్యులు హాజరయ్యారు. విఖనస మహర్షి ఆవిర్భావం, వైఖానస ఆగమ విషయాలపై పలువురు వక్తలు మాట్లాడారు. అనంతరం పండిత విభాగం, ఆగమ విద్యార్థి, వైద్య విభాగం, అర్చక విభాగాలలో సేవలందిస్తున్న రొంపిచర్ల సత్యనారాయణాచార్యులు, దీవి యజ్ఞ భట్టర్ పార్థసారధి అయ్యంగార్, నారాయణం దత్తాత్రేయ, డాక్టర్ దీవి సీతారామచక్రవర్తి, డాక్టర్ పుసులూరి మురళీకృష్ణ, దీవి అప్పలాచార్యులు, అళహరి నరసింహమూర్తి, రొంపిచర్ల నరసింహాచార్యులు, నారాయణం లక్ష్మణాచార్యులు, వినుకొండ వెంకట నరసింహ శేష తల్పసాయిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చీరాల డివిజన్ అధ్యక్షులు రావుల కొల్లు పరాంకుశం వెంకటరంగాచార్యులు, ప్రధాన కార్యదర్శి నారాయణం శ్రీనివాసాచార్యులు, కోశాధికారి వినుకొండ వెంకట ఫణీంద్ర కుమార్, చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలలోని వైఖానస సంఘీయులు పాల్గొన్నారు.

అధికారుల తీరు మార్చుకోవాలి



ప్రజా సమస్యలపై కౌన్సిల్‌లో చర్చిస్తున్న కౌన్సిలర్లు

చీరాల: కొందరు అధికారుల తీరు కారణంగా మేము ఆరోపణలు ఎదుర్కొంటున్నామని అధికారులను మున్సిపల్ కౌన్సిలర్లు ప్రశ్నించారు. గురువారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన జీరో అవర్‌లో పలువురు తమ ప్రాంత సమస్యలను కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు మాట్లాడుతూ ఊటుకూరువారి వీధి రోడ్డు విస్తరణ గత ఆరు సంవత్సరాలుగా నిలిచిపోయిందన్నారు. చైర్మన్ మాట్లాడతూ సెల్‌టవర్స్ కనెక్షన్లు తొలగించాలని, అలానే భవనం కూడా అవసరమైన మేరకు తొలగించి విస్తరణ పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు. కౌన్సిలర్ కీర్తి వెంకట్రావ్ మాట్లాడూతూ పట్టణంలో 33 వార్డులలో ఇళ్లు నిర్మించుకోవాలంటే కనీసం 30 అడుగులు రోడ్లు ఉంటేనే ప్లానింగ్ ఇవ్వాలనే నిబంధన కారణంగా చాలా మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బత్తుల అనిల్ మాట్లాడుతూ 31వ వార్డులో 4 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పాపిశెట్టి సురేష్ మాట్లాడుతూ తాగునీరు అధ్వానంగా ఉంటున్నాయన్నారు. మించాల సాంబశివరావు మాట్లాడుతూ తన వార్డులో స్కూల్, అపార్ట్‌మెంట్లు, నివాస గృహాల మధ్య సెల్‌టవర్ అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని నిర్మాణాన్ని నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. మెత్తం అజెండాలోని 67 అంశాలు ఉండగా ఒక అంశాన్ని రద్దు చేయాగా మిగిలిన 66 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ కె. రామచంద్రారెడ్డి, డిఈ యేసయ్య కౌన్సిలర్లు ఉల్లిపాయల సుబ్బయ్య, సల్లూరి సత్యానందం, పిల్లి జ్యోతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు మొక్కలు దోహదం

చీరాల అర్బన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా గురువారం పట్టణంలోని పాపరాజుతోటలోని సరస్వతి శిశు మందిర్ ప్రాథమిక పాఠశాలలోని ఆవరణలో రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. చెట్లను ఇష్టారాజ్యంగా నరికివేయడం వలన పర్యావరణానికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మామిడాల శ్రీనివాసరావు, పోలుదాసు రామకృష్ణ, వలివేటి మురళీకృష్ణ, డివి సురేష్, జివై ప్రసాద్, శీరాం రమేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

విద్యా సామర్థ్యాల పెంపునకు కృషి అవసరం



స్వర్ణలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈవో, ఉపాధ్యాయులు



వైదన సమావేశంలో మాట్లాడుతున్న సెక్రటరీ, ఎంఈవో

స్వర్ణ(కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్య, సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని ఎంఈవో మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గతంలో మాదిరిగా కాకుండా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతుల కల్పన ఉందన్నారు. అలాగే వారికి కార్పొరేట్ స్థాయిలో మంచి నాణ్యమైన బోధనలు జరిగించేలా ప్రభుత్వం అనేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసిందన్నారు. విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే బోధనలపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ ఎంవీ సుబ్బారావు, కార్యదర్శి పీ కోటేశ్వరరావు, జీ రమేష్‌రెడ్డి, మండలంలోని 20 పాఠశాలల నుంచి 22 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యేలా బోధించాలి..

బల్లికురవ: నూతన విద్యా విధానం ప్రకారం విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు విద్యా బోధన చెయ్యాలని ఎంఈవో-2 కె. రమేష్ కోరారు. గురువారం కోణిదెన, వైదన, ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశాలు కొప్పరపాడు ఉన్నత పాఠశాలలో నియోకవర్గంలోని 5 మండలాల స్కూల్ అసిస్టెంట్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులకు జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సిలబస్ షెడ్యూల్ ప్రకారం పూర్తిచేస్తూ విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. డిజిటల్ టెక్నాలజీ, స్మార్ట్‌టీవీల ద్వారా పాఠాలు సులభంగా అర్థం చేసుకునే అవకాశం ఉందని ఎంఈవో తెలిపారు. సమావేశంలో కాంప్లెక్స్ చైర్మన్‌లు కెబీ. వెంకటేశ్వరరావు, ఎస్. మారుతి, శ్రీనివాసరావు, కాంప్లెక్స్ సీఆర్పీలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రాగితీగ చోరీ

మార్టూరు: వ్యవసాయ భూముల్లో వినియోగించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగె చోరీకి గురైన విషయమై గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైనట్లు ఎస్సై కే కమలాకర్ తెలిపారు, ఆయన వివరాల మేరకు.. కోనంకి గ్రామ పరిధిలో వ్యవసాయ భూముల్లో పంటలకు నీటి అవసరాల కోసం వినియోగించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు రూ.9 వేలు విలువైన రాగి తీగను అపహరించారు. వెంకటేశ్వర్లు విద్యుత్ ఏడీఈ మువ్వా సురేంద్రబాబు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కౌన్సిల్‌లో అభివృద్ధి పనులకు ఆమోదం



మాట్లాడుతున్న చైర్మన్

అద్దంకి రూరల్: అద్దంకి పురపాలక సంఘం సమావేశంలోని 63 అంశాల అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. గురువారం స్థానిక కౌన్సిల్ హాలులో జరిగిన పురపాలక సంఘ సమావేశానికి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఆర్ఐ అర్జున్‌రావు అంశాలకు చదివి సభ్యులకు వినిపించారు. దీనిలో మొదటగా పాత ఎమ్మార్వో కార్యాలయాన్ని రెవిన్యూ శాఖ పురపాలక సంఘానికి అప్పగించిందని, శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించేందుకు, చెట్లను తొలగించి చదును చేయటానికి, బంగ్లా రోడ్డులో అడ్డంగా ఉన్న వేపచెట్లు తొలగించే పనులకు, సంబంధించిన అంశాలు చదువుతండగా మిగిలిన అంశాలను కూడా సభ్యులకు ఆమోదం తెలిపటంతో సభ ముగిసింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, ఇన్‌చార్జి ఏఈ మరియదాసు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగిన దస్తావేజు లేఖర్ల ధర్నా

పర్చూరు (చినగంజాం): దస్తావేజు లేఖరుల పెన్ డౌన్ ధర్నా కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కార్డ్ ప్రైమ్ 2.0 రిజిస్ట్రేషన్ పద్ధతిని రద్దు చేయాలంటూ వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం సభ్యులు కే సత్యనారాయణ, ఆదిపూడి మోహన్‌కృష్ణ, తులసి శ్రీనివాసరావు, కారంపూడి సందీప్ తేజ తదితరులు పాల్గొన్నారు. ఇంకొల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖరులు ధర్నాలో భాగంగా బైఠాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తానికొండ ఎలియాజర్, దస్తావేజు లేఖరులు ఏ శ్రీనివాసరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సైడ్ కాలువలకు ఎంపీ నిధులు

కారంచేడు: మండలంలోని జరుబులవారిపాలెం ఎస్సీ కాలనీ సమీపంలోని చర్చి వద్ద ఉన్న సీసీ రోడ్డుకు ఇరువైపులా ముగురు కాల్వల నిర్మాణానికి అవసరమైన నిధులను బాపట్ల ఎంపీ నందిగం సురేష్ విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చిరుమల సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ప్రజలు గురువారం ఎంపీ నందిగం సురేష్‌ను ఆయన స్వగృహంలో కలిసి గ్రామంలో సైడు కాల్వల సమస్యను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే కాలువ నిర్మాణానికి సుమారు రూ 5 లక్షల వ్యయంతో ప్రతిపాదనలు తయారు చేసి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బుర్రి కృష్ణయ్య, పుష్పరాజ్, కోట అనీల్, జీ విజయ్, ఉసురుపాటి సామేలు, గోపీ, బీ నాగరాజు, పీ అంజయ్య, చిన్నబ్బాయి, సుందర్రావు, చిట్టియ్యలు పాల్గొన్నారు.



ఎంపీ సురేష్‌ను కలసిన జేవీపాలెం గ్రామస్తులు

పింఛన్ల పంపిణీ పటిష్టంగా నిర్వహించాలి



స్వర్ణలో వలంటీర్లతో మాట్లాడుతున్న రమేష్‌బాబు

స్వర్ణ(కారంచేడు): నేడు మండలంలోని 14 గ్రామాల పరిధిలో 12 సచివాలయాల్లో ఉన్న పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ కార్యక్రమం పటిష్టంగా నిర్వహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఈవోపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని స్వర్ణ సచివాలయ ప్రాంగణంలో గ్రామ వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలో 6001 మంది వివిధ రకా పింఛన్‌లు తీసుకుంటున్నారన్నారు. ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా వలంటీర్లు పంపిణీ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి 554 నూతన పింఛన్లు మంజూరు

చీరాల టౌన్: ప్రభుత్వం చీరాల నియోజకవర్గానికి నూతనంగా 554 నూతన పింఛన్లు మంజూరు చేసిందని ఎంపీడీవో కె.నేతాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఏడాదికి రెండు సార్లు నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందిస్తుంది. మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు 279, వేటపాలెం మండలానికి 275 నూతన పింఛన్లు మంజూరు చేశారని వీరికి సెప్టెంబర్ 1 తేదీ నుంచి వలంటీర్లు అందిస్తారని ఎంపీడీవో తెలిపారు.

ఆహా క్యాంటిన్‌తో ఆర్థిక భరోసా



ఆహా క్యాంటీన్ ప్రారంభిస్తున్న కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: ఆహా క్యాంటిన్ ఏర్పాటుతో స్వయం సంఘాల మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గురువారం పట్టణంలోని జగనన్న మహిళా మార్ట్ సముదాయంలో స్వయం సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ చూపించేందుకు ఆహా క్యాంటీన్‌ను కృష్ణచైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ స్వయం సంఘాల మహిళలు తయారు చేసిన ప్రతి వస్తువు మార్కెటింగ్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అద్దంకి మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, కమిషనర్ శ్రీనివాసులు, మెప్మా అధికారి ఫణికుమారి, కౌన్సిలర్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ



వైఎస్సార్ విగ్రహం

బల్లికురవ: మండలంలోని ఉప్పుమాగులూరు పంచాయతీలోని సోమవరప్పాడు గ్రామంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటుతో పాటు వైఎస్సార్ సీపీ జెండాను శనివారం ఆవిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ గ్రామ నాయకుడు కొండవర్తి సాంబయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, సీనియర్ నాయకుడు బీసిహెచ్ గరటయ్య, జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య పాల్గొంటారని, మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని సాంబయ్య కోరారు.

అన్నదాతలకు అందుబాటులో ఎరువులు

చీరాల టౌన్: ఖరీఫ్ సీజన్లో రైతులకు కావాల్సిన అన్ని రకాల ఎరువులను ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచిందని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.రమణారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని గవినివారిపాలెం గ్రామంలోని ఆర్‌బీకేలో నిల్వ చేసిన ఎరువుల నిల్వలను ఆయన, సలహా మండలి సభ్యుతో కలిసి పరిశీలించారు. డీఏపీ 50 కేజీల బస్తా రూ.1350, 20-0-13బస్తా రూ.1108, 50 కిలోల 14-35-14 బస్తా రూ.1500 అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, పలువురు రైతులు ఉన్నారు.



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న రమణారెడ్డి

కోనంకిలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ దివ్యలహరి

మార్టూరు: మండలంలోని కోనంకి గ్రామంలో గురువారం ద్రోణాదుల పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వర తీవ్రత అధికంగా ఉందనే వార్తల నేపథ్యంలో మెడికల్ ఆఫీసర్ దివ్య లహరి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సిబ్బంది ఇంటింటికి తిరిగి వైద్యపరీక్షలు నిర్వహించగా ఒక వ్యక్తికి మాత్రమే జ్వరం ఉన్నట్లు గుర్తించారు. ఆశ వర్కర్‌లు, ఏఎన్ఎంలు నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలను గుర్తించి నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారీ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ ఆంజనేయరావు, రమణమూర్తి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.